ఒక్క రోజులో తను వస్తున్నానని మళ్ళీ తుగ్లక్ కబురు చేసాడు. ఖుస్రూ ఏడుస్తూ వచ్చి నిజాముద్దీన్‌తో చెప్పాడు.

"ఆ దుర్మార్గుడు రేపు వచ్చేస్తున్నాడు. రాజీకి రావడం గురించి ఏమైనా ఆలోచించారా?"

"అతనికి ఢిల్లీ చాలా దూరంగా ఉంది." శాంతంగా జవాబు చెప్పాడు.

"షెహన్షా ఢిల్లీ పొలిమేరలకి వచ్చారు. ఇంక కొన్ని గంటల్లో మీ నివాసం కూలడం మీరు స్వయంగా చూడచ్చని షెహన్షా మీకు తెలియచేయమన్నారు." తుగ్లక్ మర్నాడు పంపిన ఇంకో వార్తాహరుడు సరాసరి నిజాముద్దీన్ దగ్గరకి వచ్చి చెప్పాడు.

"అతనికి ఢిల్లీ ఇప్పటికీ చాలా దూరంగా ఉంది." అతనికి శాంతంగా జవాబు చెప్పాడు ఔలియా.

మర్నాడు ఉదయం షెహన్షా తుగ్లక్‌కి స్వాగతం పలకడానికి ఏర్పాటు చేసిన బరువైన ద్వారం దగ్గరకి నిజాముద్దీన్ మీద రగిలే పగతో చేరుకున్నాడు గయాజుద్దీన్ తుగ్లక్. అకస్మాత్తుగా ఆ ద్వారం కూలిన దుర్ఘటనలో తుగ్లక్ మరణించాడు. నిజాముద్దీన్ మాటల్లో సత్యం ఉంది. అతనికి ఇప్పటికీ ఢిల్లీ దూరంగానే ఉంది.

ఎప్పుడైనా మీరు ఢిల్లీ వెళితే నిజాముద్దీన్ స్టేషన్‌లో దిగి, దగ్గరే ఉన్న నిజాముద్దీన్ సమాధిని దర్శించి అక్కడ కాసేపు ప్రార్థన చేసుకోండి. కనీసం రైల్లో నించైనా. లేదా మీరు ఢిల్లీలో వున్నా, మీకు ఢిల్లీ చాలా దూరంలో ఉన్నట్లే.

## 45. ధర్మం తర్వాతే ఏదైనా

రామ రావణ యుద్ధం జరుగుతోంది. ఇంద్రజిత్, కుంభకర్ణులు, వారి కుమారులు కూడా యుద్ధంలో మరణించారు. ఇంతలో వారంతటి శూరుడైన ఓ రాక్షసుడు లంకలోంచి యుద్ధానికి వచ్చి వానరులని వూచ కోత కోయసాగాడు. ఇది గమనించిన విభీషణుడు వెంటనే తన గదని తీసుకుని ఆ రాక్షసుడి మీదకి యుద్ధానికి వెళ్ళాడు. ఇద్దరి మధ్యా భీకర యుద్ధం జరిగింది. ఇద్దరి శరీరాలు

రక్తసిక్తాలయ్యాయి. చివరికి విభీషణుడు వేసిన బాణాలకి అతని తల తెగి నేల మీద పడింది. రాక్షసులంతా హాహాకారాలు చేస్తూ లంకలోకి పరిగెత్తితే, వానరులు ఆనందంగా అరిచారు.

విభీషణుడు నెమ్మదిగా రథం దిగి, కిందపడ్డ ఆ తల దగ్గరకి వెళ్ళి, దాన్ని ఒళ్ళోకి తీసుకుని 'హా కుమారా!' అని రోదించసాగాడు.

"అతను నీ కొడుకే అని నాతో ముందే ఎందుకు చెప్పలేదు?" అది గమనించిన రాముడు బాధగా చూస్తూ అడిగాడు.

"అధర్మపరుడు నా అన్న అయితే ఒకటీ, నా కొడుకైతే ఇంకోటీ కాదుగా. ధర్మానికి అడ్డు వచ్చిన ఎవరినైనా సరే అడ్డు తొలగించాలన్న ధర్మాన్ని పాటించాను." విభీషణుడు చెప్పాడు.

## 46. గుర్తింపు

ఓ శిష్యుడు గురువుని తన సందేహం తీర్చమని కోరుతూ ఇలా అడిగాడు.

"స్వామీ! ఓ జ్ఞాని మాత్రమే ఇంకో జ్ఞానిని గుర్తిస్తాడని పెద్దలు చెప్తుంటారు కదా. ఇది నిజమేనా?"

"నిజమే." ఒప్పుకున్నాడు గురువు.

"జ్ఞాని, జ్ఞాని కాని వాడు ఎలాంటి తేడా లేకుండా చూడటానికి ఒకేరకంగా కనిపిస్తూంటారు కదా. మరి వాళ్ళా విషయాన్ని ఏ గుర్తుల ద్వారా తెలుసుకోగలుగుతారు?" ప్రశ్నించాడు శిష్యుడు.

"ఓ గదిలో తొమ్మిది మంది నిద్రిస్తున్నారనుకుందాం. వారిలో ఒకరికి మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు. అప్పుడు ఎవరు మేలుకుని వుందీ, ఎవరు నిద్ర పోతున్నదీ ఎవరికి తెలుస్తుంది?" ప్రశ్నించాడు గురువు.

"మెలకువ వచ్చిన అతనకి ఆ సంగతి తెలుస్తుంది." జవాబు చెప్పాడు

"సరే. మిగిలిన వారిలో ఇంకొకడికి కూడా మెలకువ వచ్చింది. అప్పుడు అతనూ లేచాడు. ఎవరు మేలుకుని వున్నారో, ఎవరు పడుకుని ఉన్నారో ఆ